## పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై లైంగికదాడి

### నిందితుడికి మూడు సంవత్సరాల జైలు

ఎదులాపురం, జూన్ 19 : యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.8వేలు జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ పీ శివరాం ప్రసాద్ తీర్పు ఇచ్చినట్లు కోర్టు లైజన్ అధికారి పండరి తెలిపారు. తీర్పుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు.. నార్నూర్ మండలం బాబేఝరి గ్రామానికి చెందిన యువతికి బేల మండలంలోని సాంగ్విపాఠాగూడకు చెందిన కినక జల్పత్‌రావ్(25) పరిచయమయ్యాడు. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మాయ మాటలు చెప్పి శారీరకంగా వాడుకుని గర్భవతి చేశాడు. పెండ్లి విషయాన్ని అడిగినప్పుడు ఇప్పటికే వివాహమైందని చెప్పి బాధితురాలిని పట్టించుకోకపోవడంతో ఆమె 5 జూన్ 2017న నార్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ కే శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డీఎన్ఏ పరీక్షలో పుట్టిన బాలికకు కినక జల్పత్‌రావ్ తండ్రిగా నిర్ధారణ అయింది. చార్జిషీట్ దాఖలు చేయగా లైజన్ ఆఫీసర్ పండరి, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి జాదవ్ శ్రీనివాస్ పది మంది సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంజయ్ కుమార్ వై.రాగరే వాదనలు సమర్థవంతం విన్నవించగా న్యాయమూర్తి నిందితుడికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.8వేలు, జరిమానా విధించారు. బాధితురాలికి రూ.5లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశించారు. ఈ కేసు విచారణలో సాక్ష్యాలను సమర్పించి న్యాయ తీర్పు దక్కేలా కృషి చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## హైదరాబాద్‌లో కప్పర్ల వాసి ఆత్మహత్య

తాంసి, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలకు వెళ్తే.. కప్పర్ల గ్రామానికి చెందిన జాజి మొగ్గ శంకర్(58) హైదరాబాద్‌లోని బోరబండాలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 3 సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. గురువారం అదే పాఠశాల ఆవరణలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. శంకర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## గుడుంబా విక్రయించిన వ్యక్తికి జరిమానా

బజార్‌హత్నూర్, జూన్ 19: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలోని టెంబి గ్రామానికి చెందిన సీడాం భీంరావ్ పలుమార్లు గుడుంబా కేసులో పట్టుబడడంతో పాటు బైండోవర్ ఉల్లఘించినందుకు గాను గురువారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో మారోసారి బైండోవర్ చేసి రూ.50వేల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ జుల్ఫీకర్‌ఆహ్మద్ తెలిపారు. ఎవరైన గుడుంబా అమ్మిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

కడెం, జూన్ 19 : నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో బందోబస్తు నిర్వహిస్తున్న దస్తురాబాద్ ఎస్ఐ సాయిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన అదే గ్రామానికి చెందిన నీరటి రాజేందర్ అలియాస్ తెలంగాణ రాజేందర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి అనంతరం ఖానాపూర్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ హన్మాండ్లు తెలిపారు.

## మట్కా నిర్వాహకుల ..

ఎదులాపురం, జూన్ 19 : మట్కా నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఇందిరానగర్‌కు చెందిన ఫర్జానా, జవానా మట్కా నిర్వహిస్తూ మహారాష్ట్రలో అశోక్ సామ్రాట్‌కు మట్కా చిట్టీలు పంపుతున్నారు. పక్క సమాచారం మేరకు ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, రూ.15,180 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ తెలిపారు.

## ఇంట్లో చోరీ

ఎదులాపురం, జూన్ 19 : ఆదిలాబాద్‌లోని సుందరయ్య నగర్‌కు చెందిన పఠాన్ ఇమ్రాన్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వరండాలో నిద్రిస్తున్నాడు. ఇదే సమయంలో దొంగలు ఇంట్లో చొరబడి బీరువాలోని 15 తులాల వెండి, 14 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు.

## కృత్రిమ కొరత సృష్టించి రైతుల నుంచి అదనంగా వసూలు

భైంసా, జూన్ 19 : నిర్మల్ జిల్లా భైంసాలో డీఏపీ అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు బస్తా ధర భారమవుతుంది. ప్రస్తుతం సోయా, పత్తి పంటలకు డీఏపీ వేయాల్సి ఉండడంతో దుకాణాలకు రైతులు పరుగులు తీస్తున్నారు. వారి అవసరాన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు గరిష్ఠ ధర కంటే బస్తాపై అదనంగా రూ. 100– 150 తీసుకుంటున్నారు. 20 రోజుల నుంచి కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం డీఏపీ బస్తా రూ.1350కి విక్రయించాలి. కాని రూ.1475కు వ్యాపారులు బస్తాను విక్రయిస్తున్నారు.

### అధిక ధరకు డీఏపీ




-సంపత్ పటేల్, రైతు

భైంసాలోని దుకాణంలో డీఏపీ బస్తా అధిక ధరకు విక్రయిస్తున్నారు. రూ. 1,350 ఉండగా బస్తాను రూ.1,475 అమ్ముతున్నారు. తక్కువ ధరకు అడిగితే లేదని చెబుతున్నారు.

## భూభారతి గ్రామసభ పరిశీలన

సారంగాపూర్, జూన్ 19: జామ్ గ్రామంలో నిర్వహించిన భూభారతి గ్రామసభను కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. అనంతరం జామ్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం, నాణ్యమైన విద్యను అందించాలని, సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఈవో రామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ హది, అధికారులు, రైతులు ఉన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి



టీ షర్టులు పంపిణీ చేస్తున్న సభ్యులు

నిర్మల్ అర్బన్, జూన్ 19 : నిర్మల్‌లోని దివ్యగార్డెన్‌లో వశిష్ట యోగా సంఘటన, ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు యోగా నిర్వాహకులు తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి నార్లపురం రవీందర్ యోగా టీషర్టులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అఖిలేశ్ కుమార్, ప్రవీణ్, సతీశ్, శశిరాజ్, శ్రీనివాస్, గంగాధర్ పాల్గొన్నారు.

# నాళాలు ఇలా.. నీరు పారేదెలా..?

- వర్షాకాలం దృష్ట్యా నాళాల శుభ్రతపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం



జౌళి నాళాలో పెరిగిన మొక్కలు



మంచిర్యాల చౌరస్తాలోని నాళాలో వ్యర్థాలు

నిర్మల్ అర్బన్, జూన్ 19 : వర్షాకాలం దృష్ట్యా నిర్మల్ మున్సిపాలిటీలో సరైన ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పట్టణంలోని ప్రధాన కాలువలు, భారీ డ్రైనేజీలు చెత్తతో నిండి ఉండడంతో వర్షానికి రోడ్లపై నీరు నిలిచే పరిస్థితులు ఏర్పడ్డాయి. గతంలో కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన ఘటనలు మరువకముందే, ఈ సంవత్సరం కూడా అదే పరిస్థితి పునరావృతం కానుందన్న భయం నెలకొంది. ముఖ్యంగా జౌళినాళ పరివాహక ప్రాంతాల్లో నాళాలు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయి నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం కలుగుతుంది.

### జౌళినాళ శుభ్రతపై అధికారుల నిర్లక్ష్యం

వర్షాకాలానికి ముందే శుభ్రత పనులు చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు ఇప్పటికీ స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. గత పాలనలో వర్షాకాలానికి రెండు నెలల ముందే అభివృద్ధి పనులు ప్రారంభించే వారు. కానీ ప్రస్తుతం ప్రత్యేక పాలన ఈ విధానం పాటించకపోవడంతో తక్షణమే చర్యలు అవసరమవుతున్నాయి.

### అతిగా ముంపు ఉన్న ప్రాంతాలు

నిర్మల్‌లోని శివాజీ చౌక్, బుధవార్‌పేట్ కాలనీ, జౌళినాళ పరివాహక కాలనీలు, విజయనగర్, శాస్త్రినగర్(హెచ్‌పీ గ్యాస్), శాంతి నగర్ క్రాస్ రోడ్డు, నటరాజ్ మిల్, గొల్లపేట్, సిద్దాపూర్, విశ్వనాథ్‌పేట్, దివ్యనగర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడం, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు అవరోధంగా మారుతున్నాయి.

### అభివృద్ధి పనులు చేస్తున్నాం



ప్రస్తుత వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నాం. జౌళినాళాలో పిచ్చిమొక్కల తొలగింపు పనులు అక్కడక్కడ ప్రారంభమయ్యాయి. జీఎన్ఆర్ కాలనీకి వరదముంపు ఉండడంతో అక్కడ కల్వర్టుల ఎత్తును తగ్గించాం. ప్రజలు ఇళ్ల చుట్టుపక్కల చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అప్పగించాలి. వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేశాం. అలాగే ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో టోల్ ఫ్రీ నంబర్ 7036661070కు సమాచారం అందించాలి.

-నిర్మల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ రెడ్డి

# నేరాల నియంత్రణకు 'అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్'



ఆటోకు స్టిక్కర్ వేస్తున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఉట్నూర్, జూన్ 19: నేరాల నియంత్రణకు ఒక భాగంగా 'అభయ మై టాక్సీ ఈజ్ సేఫ్' కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లాలో అమలు చేస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. గురువారం ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ కాజల్ సింగ్‌తో కలిసి ఆటోలకు క్యూర్ కోడ్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలకు భద్రత కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని తీసుకువచ్చామన్నారు. ఆటో డ్రైవర్లు రూ. 350తో రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఏడాదికి రూ. లక్ష ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందన్నారు. ఆటోలకు ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ ద్వారా ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు జరిగిన వెంటనే గుర్తించవచ్చని వెల్లడించారు. ప్రస్తుతం జిల్లాలో 3,232 ఆటోలు, ఉట్నూర్ డివిజన్‌లో 850 వాహనాలు ఈ కార్యక్రమానికి నమోదు అయ్యాయని పేర్కొన్నారు. ఈ వాహనాల్లో ప్రయాణించే మహిళలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ట్రాక్ మై లోకేషన్, ఎమర్జెన్సీ కాల్, కంప్లైంట్ వంటి సదుపాయాలు వినియోగించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ మొగిళి, ఎస్ఐ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

పెంబి, జూన్ 19 : నిర్మల్ జిల్లా పెంబి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ. 8 వేలు విరాళం ప్రధానోపాధ్యాయుడు రాంచందర్‌కు గురువారం అందజేశారు. పాఠశాల సిబ్బంది పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సుధీర్, పుప్పాల రమేశ్, గంగాధర్, స్వామి పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

లక్ష్మణచాంద, జూన్ 19: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను గురువారం క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అశోక్‌వర్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికి తీయడానికి క్రీడాపాఠశాలలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు రమణరావు, ఉపాధ్యాయులు భూషణ్, శ్రీనివాస్, వాసుదేవారెడ్డి, డేవిడ్, బెనహార, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ

నార్నూర్, జూన్19 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 21వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

## హైమాస్ట్ లైట్లు ప్రారంభం



చింతపల్లిలో హైమాస్ట్ వెలుగులో యువకులు

తాంసి(భీంపూర్), జూన్ 19: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని చింతపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కృషితోనే ఆదివాసీ గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు మంజూరయ్యాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మడావి లింబాజీ, కుడిమెత సంతోష్, జాదవ్ రవీందర్, రాథోడ్ ఉత్తమ్, ధరంసింగ్, పురుషోత్తం పాల్గొన్నారు.

## గోదావరిలో రెస్క్యూ డ్రీల్



రెస్క్యూ డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

బాసర, జూన్ 19 : బాసర గోదావరి నదిలో గురువారం నిర్మల్ జిల్లా శివంగి టీం ఆధ్వర్యంలో రెస్క్యూ డ్రీల్ నిర్వహించారు. ఈ శివంగి టీం ఎస్పీ జానకీ షర్మిల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళ బృందం, పలు శిక్షణ పొంది రక్షణ, రెస్క్యూ పనులో నైపుణ్యంతో పాటు సంస్కరంతో కూడిన ప్రజా పరిరక్షణ భావాన్ని కలిగి ఉంటారు. ఈ శివంగి టీం ఆధ్వర్యంలో వరద సహాయక చర్యల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. బాసర పరిధిలో ఇటీవల ఏర్పడిన ప్రతికూల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ ముందస్తు రెస్క్యూ డ్రిల్‌ను చేపట్టింది. ఈ డ్రీల్‌ను ఎస్పీ జానకీ షర్మీల పరిశీలించారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపత్కాలంలో అండగా ఉంటాం

నిర్మల్ అర్బన్, జూన్ 19: వర్షాకాలం నేపథ్యంలో వరదలు, వాగుల్లో చిక్కుకున్న ప్రజలకు ఆపత్కాలంలో అండగా నిలుస్తామని నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. నిర్మల్‌లోని బంగల్‌పేట్ వినాయక్ సాగర్‌లో డిస్ట్రిక్ డిజాస్టర్ రెస్పార్స్ ఫోర్స్‌లోని 82 మంది పోలీసులకు ప్రత్యేక శిక్షణను నిర్వహించారు.

## మున్సిపల్ అధికారుల పని తీరుపై ఆగ్రహం

నిర్మల్ అర్బన్, జూన్ 19 : నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడులు పెరిగిపోయిన అనేక మంది ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. ఇటీవల ఇన్‌చార్జి ఆర్ సంతోష్, ఔట్ సోర్సింగ్ బిల్ కలెక్టర్ షోయబ్ ఏసీబీకి పట్టుబడడంతో అవినీతి బల్దియా పేరిట నమస్తే తెలంగాణలో ఈ నెల 11వ తేదీన కథనం ప్రచురితమైంది. గురువారం నిర్మల్ మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సందర్శించారు. అన్ని శాఖల అధికారుల పనితీరుపై రివ్యూ నిర్వహించారు. శాఖల్లో అవినీతి జరిగితే సహించేది లేదన్నారు. పట్టణంలోని పారిశుధ్య పరంగా తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎమెల్యే వెంట మాజీఎమెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు అవసరం

ఎదులాపురం, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం ఆదిలాబాద్‌లోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో పోలీసు, కోర్టు డ్యూటీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల దర్యాప్తులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శనివారం పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులతో సమావేశమై కేసుల పురోగతిని సమీక్షించాలన్నారు. ముఖ్యమైన కేసులపై ప్రత్యేకంగా ట్రయల్ పర్యవేక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హైవేల్లో ప్రమాద ప్రాంతాలను గుర్తించి రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. సాయంత్రం సమయాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, స్పీడ్ లేజర్ గన్ల ద్వారా వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, నాగేందర్, ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వివిధ అంశాలపై అధికారులతో సమావేశం

ఎదులాపురం, జూన్ 19 : ఆదిలాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన గురువారం ఓపెన్ స్కూల్, ఉల్లాస్, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల నమోదు, బడి మానేసిన పిల్లల గుర్తింపు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉల్లాస్ యాప్‌లో డేటా అప్‌లోడ్, పిల్లల గుర్తింపు, సర్వే పనులు తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే పంచాయతీ కార్యదర్శులను వాలంటీర్లుగా నియమించాలన్నారు.

### ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభం

తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా దూరవిద్య విద్యావిధానంలో పదోతరగతి, ఇంటర్ ప్రవేశాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమయ్యాయి. www. telanganaopenschool. org వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి, పదో తరగతి ప్రవేశ ఫీజు ఓసీ పురుషులకు రూ.1400, ఇతరులకు రూ.1000, ఇంటర్ ప్రవేశానికి ఓసీ పురుషులకు రూ.1500, ఇతరులకు, మహిళలకు రూ.1200. ఫీజు చెల్లించి దరఖాస్తులు అధ్యాయన కేంద్రాల్లో అందజేయాలని సూచించారు. సందేహాలకు ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ అశోక్ 8008403519 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 12 నుడి జూలై 11వ తేదీ వరకు, నిర్ణీత అపరాధ రుసుముతో జూలై 12 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు ఇంటర్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, అపరాద రునుము పదో తరగతికి రూ100, ఇంటర్మీడియట్‌కు రూ.200 చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్, డీఈవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీడబ్ల్యూవో మిల్కా, డీసీపీవో రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నార్నూర్, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మైనార్టీ, వడ్డెర కాలనీవాసులు నీటి సమస్యను పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. దీంతో గంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న నార్నూర్ ఎస్ఐ అఖిల్ సముదాయించారు. నీటి సమస్యను పరిష్కరించే వరకు ఇక్కడి నుంచి కదిలేదంటూ కాలనీవాసులు స్పష్టం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్‌కి ఫోన్‌లో సమస్యను తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కరిస్తామని డీఈ చెప్పడంతో నిరసనను విరమించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను బాగు చేసి సమస్యను పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున నిరసన చేపడుతామని హెచ్చరించారు.

## రైతుల ఖాతాల్లో 156,95 కోట్లు జమ

నిర్మల్ చైన్‌గేట్, జూన్,19: నిర్మల్ జిల్లాలో రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.156.95 కోట్ల నిధులు జమైనట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాలో మొత్తం 1,86,400 రైతులకు గాను 1,54,195 మంది ఖాతాల్లోనిధులు చేరాయని వివరించారు. మిగిలిన రైతులకు త్వరలోనే నిధులు జమ కానున్నట్లు తెలిపారు.

## తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు

ఇంద్రవెల్లి, జూన్ 19: వర్షాకాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూస్ ఈఈ చంద్రమోహన్ అన్నారు. గురువారం ఇంద్రవెల్లి మండలంలోని బుర్సన్‌పటార్, కోయల్‌పాండ్రిలో తాగునీటి సంక్షేమ పథకాల ట్యాంకులతో పాటు మిషన్ భగీరథ పథకాన్ని ఆయన పరిశీలించారు. అందుబాటులో ఉన్న అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఇంద్రవెల్లి, జూన్ 19: ఇంద్రవెల్లి మండలంలోని పిప్రి గ్రామ శివారులో ఆత్రం మోతీరాం రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు స్తంభాలు నేలకొరిగి ప్రమాదకారంగా దర్శనమిస్తున్నాయి. దీంతో వానకాలం సీజన్ వ్యవసాయ పనుల చేసేందుకు కూలీలు రావడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూమిలో ప్రమాదకారణంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



నేలకొరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న రైతులు, గ్రామస్తులు

## ఐదెకరాలకు రైతు భరోసా వచ్చిందన్న మంత్రిమాట అవాస్తవం

నేరడిగొండ, జూన్ 19 : ఐదెకరాల వరకు రైతు భరోసా వచ్చిందని ప్రకటన చేసిన మంత్రి మాట అవాస్తవమని బీఆర్ఎస్ బోథ్ సోషల్ మీడియా నాయకుడు మజర్ ఖండించారు. గురువారం నేరడిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు దఫాలుగా రైతు భరోసా ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. 5 ఎకరాల వరకు ఉన్న రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేశామని మంత్రి ప్రకటన చేయడం తనే సాక్షిని అని అన్నారు. తనకు ఉన్న 4–33 గుంటల వారసత్వ భూమికి ఇప్పటికి రైతు భరోసా రాలేదన్నారు. తాను రైతు భరోసాకు అర్హుడనని కూడా అధికారులు తెలిపారని అన్నారు. రాష్ట్ర ప్రజలను ఏదో ఒక విధంగా ప్రభుత్వం అబద్ధాలతో మోసం చేస్తూ వస్తుందన్నారు. స్థానిక ఎన్నికల డ్రామాగా దీనిని ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ప్రజలు తగిని గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## బాధ్యతగా విధులు నిర్వహించాలి

దస్తురాబాద్, జూన్ 19 : ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ అన్నారు. నిర్మల్ జిల్లా తహసీల్ కార్యాలయంలో గురువారం ఆయన సంబధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్తీ, జూనియర్ అసిస్టెంట్లు , తదితరులు పాల్గొన్నారు.

## బాలికల వసతి గృహం గోడలకు విద్యుత్ సరఫరా

బజార్‌హత్నూర్, జూన్ 19: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్‌లోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలోని గోడలకు విద్యుత్ సరఫరా కావడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వసతి గృహంలోని గోడలు తడిగా ఉండడంతో న్యూటల్, పేస్ రెండు విద్యుత్ బోర్డులలో చూపించడంతో గోడలకు విద్యుత్ సరఫరా అవుతుందని వసతి గృహం కేర్‌టేకర్ సరోజ తెలిపారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో హాస్టల్ వసతి కోసం అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థినులు వసతి గృహంలో ఉండాలంటే గోడలకు విద్యుత్ సరఫరా కావడంతో వెనుకడుతున్నారు. వసతి గృహంలోని పరిశుభ్రత పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహానికి మరమ్మతులు చేయాలని సిబ్బంది కొరుతున్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ తెచ్చారు.. అమర్చడం మర్చారు



అమర్చడానికి తీసుకువచ్చిన డీటీఆర్‌లు


ఇచ్చోడ(సిరికొండ), జూన్ 19: సిరికొండలోని మొదటి వాడలో నెల రోజుల క్రితం రెండు డీటీఆర్‌లను బిగించడానికి కాంట్రాక్టర్ తీసుకువచ్చారు. కానీ అమర్చడం మరిచిపోయారు. దీంతో పాత డీటీఆర్లపై అధిక లోడు పడడంతో నెల రోజుల నుంచి విద్యుత్ సమస్య ఏర్పడుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మాటిమాటికీ దీనికి మరమ్మతు చేయడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టర్, విద్యుత్ శాఖాధికారులు కొత్త డీటీఆర్లను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



బోథ్ : పరామర్శిస్తున్న మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లా సొనాల మండలంలోని పార్డి(బీ) గ్రామానికి చెందిన లలితబాయి అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను గురువారం బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పరామర్శించారు. సొనాలకు చెందిన రాజారాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలుకావడంతో అతడిని పరామర్శించారు. మాజీ ఎంపీపీ వెంట బీఆర్ఎస్ నాయకులు సుధీర్ రెడ్డి, అభిలాష్, భీంరావ్ పాటిల్, మునేశ్వర్ సోమన్న, రోహిదాస్, చిన్నయ్య, సంతోష్, ఈశ్వర్ ఉన్నారు.



భైంసా పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్

భైంసా, జూన్ 19 : నిర్మల్ జిల్లా భైంసాలోని రాహుల్ నగర్‌లో గల కాశీరాం ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను గురువారం బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నిమ్మ సురేశ్, సోమేశ్, అమీర్ ఉన్నారు.

## అంధకారంలో ఎస్సీవాడ వాసులు

నార్నూర్, జూన్ 19 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం మాన్కాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీవాడలో నెల రోజులుగా వీధి దీపాలు పని చేయకపోవడంతో స్థానికులు అంధకారంలో ఉంటున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో విష జంతువులు తిరుగుతుంటాయి. రాత్రివేళ బయటకు వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

బోథ్, జూన్ 19: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మండల శాఖ నాయకులు గురువారం ఎంఈవో మహమూద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండల శాఖాధ్యక్షుడు మున్సిఫ్ మాట్లాడుతూ పలు పాఠశాలల్లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. విద్యార్థులకు సరైన చదువు అందడం లేదన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగునీరు, బెంచీలు, బ్లాక్ బోర్డులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఇక్కడ ఏఐఎస్ఎఫ్ నాయకుడు నరేశ్ ఉన్నారు.

## కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి

బోథ్, జూన్ 19 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్య సంవత్సరంలో అడ్మిషన్లు పెంచాలని జిల్లా మధ్యామిక విద్యాశాఖాధికారి జాదవ్ గణేశ్ కుమార్ సూచించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ప్రతి ఏడాది కంటే ఈ విద్య సంవత్సరంలో 30 శాతం అడ్మిషన్లు పెంచాలన్నారు. కళాశాలలో ఉచిత పాఠ్య పుస్తకాలు, వసతులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్య బోధన గురించి విద్యార్థులకు తెలపాలన్నారు. కళాశాలలో చదువుతున్న ఎస్సీ, బీసీ హస్టల్లో విద్యార్థులకు వసతి సౌకర్యం గురించి వివరించాలన్నారు. ప్రిన్సిపాల్ విఠల్, అధ్యాపకులు పాల్గొన్నారు.